# రైతుల ఆదాయం రెండింతలు పెరిగిందంటూ అధ్యయనాల పేరుతో-SBI అవాస్తవాల ప్రచారం

**అనువాదం: పరుచూరి జమున**

జూలై 18, 2022న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి పరిశోధన విభాగం "వ్యవసాయంపై ప్రత్యేక నివేదిక"ను విడుదల చేసింది. నివేదిక ప్రధాన వాదన ఏమిటంటే - కొన్ని రాష్ట్రాల్లోని కొన్ని పంటల దిగుబడులను 2017-18 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2021-22 ఆర్థిక సంవత్సరంలో రైతుల ఆదాయం రెండింతలు పెరిగింది. మిగిలిన అన్ని సందర్భాల్లో ఇది 1.3 నుంచి -1.7 రెట్లు మాత్రమే పెరిగాయి. " (ప్రాముఖ్యత జోడించబడింది.)

ఒక అవాస్తవాన్ని వాస్తవంగా జరిగిందని నమ్మించడం కోసం పదేపదే చెప్పడం ద్వారా దాన్ని విస్తృతంగా ప్రచారం చేయవలసి ఉంది. ఎస్‌బిఐ నివేదిక ఎంత విస్తృతంగా మీడియాలో ప్రచారం చేశారంటే - ఇది టైమ్స్ ఆఫ్ ఇండియా, ఎకనామిక్ టైమ్స్, హిందూ బిజినెస్ లైన్, బిజినెస్ స్టాండర్డ్, ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్, ది ట్రిబ్యూన్, దైనిక్ జాగరణ్, దైనిక్ భాస్కర్, ఆప్ ఇండియా, ది ప్రింట్, స్వరాజ్య అన్ని పత్రికల్లో దీని గురించి వ్రాసారు. జీ న్యూస్, న్యూస్ 18, ఇంకా అనేక ఇతర మీడియా సంస్థలు కూడా దీన్ని కవర్ చేశాయి. ఇవన్నీ కూడా ఈ పరిశోధనలపై తమ స్వంత వ్యాఖ్యలు ఏమీ లేకుండానే నివేదికలోని విషయాలను పునరావృతం చేశాయి.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) నివేదికలోని రాజకీయ ఎజెండా సూక్ష్మమైనది కాదు. మొదటి వాక్యం "వ్యవసాయ విధానాలు గొప్ప భవిష్యత్తుకు నాంది పలుకుతున్నాయి...", ఇది ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంబంధిత కార్యక్రమాలను గొప్ప కవిత్వంతో వర్ణించింది. తన పరిశోధనలో కనిపెట్టినదాన్ని 2022-23 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న మోదీ ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యంతో చక్కగా, స్పష్టంగా జోడించింది. అన్ని పంటలకు కనీస మద్దతు ధర చట్టపరమైన హామీ కోసం రైతు సంఘాల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకునేందుకు ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసిన రోజునే - 2022, జూలై 18 వ తేదీన నివేదిక విడుదలైంది.

SBI నివేదిక ఇలా పేర్కొంది: కనీస మద్దతు ధర (MSP), మార్కెట్ ఆధారిత ధరలతో దరిదాపు సమంగా చేయబడింది, రైతులకు మెరుగైన ధరలను అందించడంలో ఇది కీలకమైనది. ఇది ఇంకా అనేక సందర్భాల్లో సరైన మంచి ధర లభించేందుకు దారితీసింది.

ఈ నేపథ్యంలో, SBI రీసెర్చ్ రిపోర్టును అధ్యయనం చేయడం చాలా ముఖ్యం. అయితే, అలాంటి 'రిపోర్ట్' ఏమీ లేదని తేలింది. 'పరిశోధనలో కనుగొన్న అంశాలు' సంక్షిప్త సారాంశం మాత్రమే ఉంది, ఇందులో సంబంధిత వివరాలు చాలా తక్కువగా, అసంబద్ధమైన విషయాలు చాలా సమృద్ధిగా ఉన్నాయి. ఇటువంటి నివేదిక ఆధారంగా కథనాలను రూపొందించిన జర్నలిస్టులను చూసి ఆశ్చర్యపోవలసిందే.

ఈ ప్రత్యేకమైన పరిశోధన నివేదికలోని కొన్ని విశేషాలను చూద్దాం.

## పరిశోధనా పద్దతి రహస్యం:

నివేదిక రచయితలు ఇలా పేర్కొన్నారు: "ఆర్థిక సంవత్సరం 2018 నుండి ఆర్థిక సంవత్సరం 2022 వరకు రైతుల ఆదాయంలో మార్పును అంచనా వేయడానికి ఎక్కువ అవకాశం ఉన్న, బాగా-వ్యాప్తిలో ఉన్న, ఎక్కువ ప్రాతినిధ్యం ఉన్న - నమూనాను తీసుకున్నాము. నమూనా పెద్ద రైతులను మాత్రమే కాకుండా చిన్న, సన్నకారు రైతులకు కూడా సరైన ప్రాతినిధ్యాన్ని కలిగి ఉంది." అయితే, రచయితలు తదుపరి వివరాలను అందించలేదు. వారి అధ్యయనం యొక్క డేటా సెట్ ఇతర పరిశోధకులకు అందుబాటులో ఉంచబడలేదు. రచయితలు దాని గురించి కొంత విశ్వసనీయతను కలిగించడానికి కనీసం కొంత సమాచారాన్ని అందించి ఉండవచ్చు; కానీ పిసరంత కూడా నిజాయితీ కనపడటం లేదు.

రైతుల గురించి వార్షిక సర్వేలు నిర్వహించే చరిత్ర SBIకి లేదు. అలా చేయడం సాధారణమైన వ్యవహారం కాదు: నేషనల్ శాంపిల్ సర్వే (NSS) 20 సంవత్సరాలలో వ్యవసాయ కుటుంబాలపై కేవలం మూడు సర్వేలను మాత్రమే నిర్వహించింది, ప్రతి ఒక్కసర్వే కోసం శిక్షణ పొందిన సిబ్బంది సైన్యాన్ని నియమించడమే ఒక పెద్ద విన్యాసం. ప్రతి సర్వే కోసం, యూనిట్-స్థాయి డేటాతో సహా నిర్వచనాలు, నమూనా, పద్దతి, ఫలితాలకు సంబంధించిన వివరణాత్మక సమాచారాన్ని NSS ప్రచురిస్తుంది.

కాబట్టి SBI రీసెర్చ్ టీమ్ ఒక సుప్రభాతం వేళ - ఐదేళ్లపాటు రైతుల ఆదాయాన్ని అధ్యయనం చేసిన “ఫలితాలను” ప్రకటించినప్పుడు, అది గొప్ప ఉత్సుకతను రేకెత్తించి ఉండాలి. డేటాను ఎలా సేకరించారు? నమూనా ఎంత పెద్దది? సన్నకారు, చిన్న, మధ్యతరహా, పెద్ద రైతులు ఎంతమందిని సర్వే చేసింది? నివేదిక ఉదహరించిన - NSS సర్వే చేసిన వ్యవసాయ కుటుంబాలకు సంబంధించిన నమూనాతో ఎలా పోల్చబడుతుంది? ఈ సందేహాలకు సమాధానము ఇవ్వడానికి ఈషన్మాత్రం కూడా ఆధారం లేదు.[1]

సర్వే లేకుండానే సమాచారం సేకరించబడిందని అధ్యయనం సూచిస్తుంది: “మా అధ్యయనం - వివిధ రాష్ట్రాలలోని SBI బ్యాంకు వ్యవసాయ రంగంతో ఎక్కువగా పనిచేసే శాఖల నుండి వివిధ పంటలకు సంబంధించిన అనేక వివరాలు తో కూడిన ( గ్రాన్యులర్ ) డేటాను కలిగిన - "అగ్రి పోర్ట్ఫోలియో"కి సంబంధించిన ప్రాథమిక డేటాపై ఆధారపడింది." "వేలాది శాఖలు నుంచి వివిధ మార్గాలు/ పద్దతుల (ఛానెల్లు/సిస్టమ్ల) ద్వారా పెద్ద ఎత్తున పొందిన సమాచారాన్ని, భారీస్థాయిలో డేటా పాయింట్లను ఓపికగా, శ్రద్ధగా పంపారు." అంటూ SBI అగ్రి బిజినెస్ యూనిట్కి ధన్యవాదాలు తెలియచేసారు. కానీ స్టేట్ బ్యాంక్ శాఖలు దాని స్వంత రుణగ్రహీతల ఖర్చులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కూడా కలిగి ఉండవు; అటువంటి డేటాను సేకరించడానికి సరైన సర్వే అవసరం, అటువంటి సర్వే చేయలేదనేది స్పష్టం.

నమూనా కేవలం SBI రుణగ్రహీతలతో రూపొందించబడినట్లు కనిపిస్తున్నందున, అటువంటి రుణగ్రహీతలు రైతులందరికీ ఎలా ప్రాతినిధ్యం వహిస్తారు? ఉదాహరణకు, అధికారిక సర్వేల నుండి మనకు తెలుసు, పేద రైతు, అతను/ఆమె 'సంస్థాగతేతర' రుణాల వనరులపై ఎక్కువగా ఆధారపడతారని - చాలా ప్రముఖంగా వివిధ రకాల వడ్డీ వ్యాపారులపై ఆధార పడతారని తెలుసు. SBI డేటాలో ఈ పేద తరగతి రైతుల ప్రాతినిధ్యం తక్కువగా ఉంటుంది. కానీ అధ్యయనం "అన్ని" రకాల రైతులను కవర్ చేసినట్లు నమ్మకంగా చెబుతోంది.

ఈ అధ్యయనం కింది రాష్ట్రాలను, ఆ రాష్ట్రాల్లోని పంటలను ఎంపిక చేసింది: రాజస్థాన్ (గోధుమలు), గుజరాత్ (పత్తి, వేరుశెనగ), మహారాష్ట్ర (సోయాబీన్, చెరకు), కర్ణాటక (పత్తి, వరి). కానీ ఈ నాలుగు రాష్ట్రాలను, ఈ ఆరు పంటలను ఎందుకు ఎంపిక చేసుకున్నది అనే దానిపై వివరణ ఇవ్వలేదు. రైతులందరినీ కవర్ చేశానన్న తన వాదనను నిరూపించడానికి ఇవి ఎలా సరిపోతాయి.

SBI నివేదిక "రైతుల ఆదాయాన్ని" ఏ ఫార్ములా ఆధారంగా లెక్కించింది? మళ్ళీ, దీనికి సంబంధించి కూడా చిన్న ఆధారం లేదు. వ్యవసాయ ఖర్చులు - ధరల కమిషన్ (CACP) - సాగు ఖర్చులకు సంబంధించిన అనేక ప్రత్యామ్నాయ సూత్రాలను ఉపయోగించి రైతుల రాబడిని గణిస్తుంది: A2 (వాస్తవంగా చెల్లించిన ఖర్చులు); A2+FL (వాస్తవంగా చెల్లించిన ఖర్చులు + కుటుంబ శ్రమను లెక్కించిన విలువ); C2 - సమగ్ర వ్యయం ( భూమి కౌలుకు లేదా అద్దెకు చెల్లించింది, పెట్టుబడిపై వడ్డీతో సహా సమగ్ర వ్యయం). నేషనల్ శాంపిల్ సర్వే (NSS )కూడా అదేవిధంగా సాగు ఖర్చులను అలాగే భూమి అద్దెను, పెట్టుబడి పై వడ్డీ ఖర్చులను కలిపి లెక్కిస్తుంది. అయితే, SBI తన పరిశోధనలో ఖర్చులను ఎలా లెక్కించింది? అలాగే రాబడి గురించి ఎలా లెక్కించారో సూచన కూడా లేదు. ముందుగా చెప్పినట్లుగా, SBI రీసెర్చ్ సర్వే లేకుండా ఈ ఖర్చులలో కొన్నింటికి సంబంధించిన డేటాను ఎలా పొందుతుందో స్పష్టంగా తెలియదు. ఏ వివరాలు లేనప్పుడు, వారి అంకెలకు అర్థం ఏమిటి?

## ద్రవ్యోల్బణాన్ని పట్టించుకోవడం లేదు

విచిత్రమేమిటంటే, నివేదిక "రైతుల ఆదాయంలో వృద్ధి"ని సూచించినప్పుడు, అది ప్రస్తుత రూపాయలలో, అంటే, ద్రవ్యోల్బణానికి సర్దుబాటు చేయకుండా చూపిస్తోంది. ఏదైనా అర్థవంతమైన కొలమానం నిజమైనది - అంటే ద్రవ్యోల్బణం-సర్దుబాటు నిబంధనలలో మాత్రమే ఉంటుందని ఖచ్చితంగా SBI పరిశోధనకు తెలుసు. ద్రవ్యోల్బణం కోసం సర్దుబాటు చేసిన తర్వాత (గ్రామీణ వినియోగదారుల ధరల సూచిక- ప్రకారం), 2018- 2022 ఆర్థిక సంవత్సరాలు మధ్య ప్రస్తుత రూపాయలలో 30 శాతం పెరుగుదల (రాజస్థాన్ గోధుమ రైతులకు) స్థిరమైన రూపాయలలో 8.4 శాతం మాత్రమే పెరుగుతుంది.

వ్యవసాయ కుటుంబాలపై గతంలో పేర్కొన్న NSS సర్వేల ఆధారంగా, 2012-13, సంవత్సరం 2018-19 సంవత్సరం మధ్య వారి సగటు నెలవారీ ఆదాయం 59 శాతం పెరిగిందని నివేదిక పేర్కొంది. అయితే, ఇది కూడా ప్రస్తుత రూపాయల్లోనే.

ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత, పెరుగుదల స్థిరమైన రూపాయలలో 17.7 శాతానికి మాత్రమే వస్తుంది.

అంతేకాకుండా, NSS సర్వేలో వ్యవసాయ గృహ ఆదాయంలో వేతనాలు, వ్యవసాయేతర వ్యాపారం,  జంతువుల పెంపకం ద్వారా వచ్చే ఆదాయం ఉంటుంది. అయితే, ఇక్కడ చర్చలో ఉన్న పంటల సాగు ద్వారా వచ్చే ఆదాయాన్ని మాత్రమే పరిశీలిస్తే, వాస్తవ పరంగా 8.8 శాతం పతనం ఉంది.[2] పంటల సాగు, జంతువుల పెంపకం ద్వారా వచ్చే ఆదాయాన్ని కలిపినా వాస్తవ పరంగా పతనావస్థలోనే ఉంది.

# అసంబద్ధమైన గణాంక పరీక్షలు

ఎస్‌బిఐ నివేదిక, అవసరమైన వాటిలో దేనినీ వెల్లడించనప్పటికీ, అసమానత పెరగలేదని చూపించే ప్రయత్నంలో అనేక రంగుల చార్ట్‌లను అందిస్తుంది. అయినప్పటికీ, అసలు నమూనానే రహస్యంగా ఉంటే, నమూనాలో అసమానత పెరుగుదల పరీక్షలు అర్థరహితమైనవి.

2018 - 2022 ఆర్థిక సంవత్సరాల మధ్య ఆదాయంలో పెరుగుదల గణాంకపరంగా ముఖ్యమైనదని  నిర్ధారించడానికి  - నివేదిక గణాంక పరీక్షలను కూడా నిర్వహిస్తుంది. కానీ 30, 70 లేదా 100 శాతం పెరుగుదల గణాంకపరంగా ముఖ్యమైనదని చూపించడానికి మీకు పరీక్షలు అవసరం లేదు! సమస్య ఏమిటంటే ఆ గణాంకాలను చేరుకునే వారి పరిశోధనా పద్ధతే అసలైన సమస్య.  వారు అనుసరించిన పరిశోధనా పద్ధతి  కేవలం - డేటా సేకరణ, నమూనా యొక్క ప్రాతినిధ్య స్వభావం, ఆదాయాన్ని లెక్కించే పద్దతి,  వాస్తవ పరంగా ఆదాయాన్ని ప్రదర్శించడంలో వైఫల్యం గురించిన ప్రశ్నల నుండి మళ్లిస్తుంది. ఆకట్టుకునేలా కనిపించే గణాంక పరీక్షలతో పేజీలను నింపడం ద్వారా, SBI నివేదిక రచయితలు - జర్నలిస్టులను అడ్డం పెట్టుకొని ఒక ప్రైవేట్ జోక్‌ను ఆస్వాదిస్తున్నట్లు కనిపిస్తోంది.

# కనీస గిట్టుబాటు ధరలు – నిరాధారమైన వాదనలు

SBI నివేదిక FY15, FY22, FY23 సంవత్సరాల్లో  వివిధ పంటలకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరల (MSPలు) పట్టికను అందిస్తుంది.  “MSP ధరల పెరుగుదల [sic] మెరుగైన ధరల ఆవిష్కరణకు సహాయపడింది...”[3] అని చెబుతుంది. అయితే, కేవలం MSPల పట్టికను పునరుత్పత్తి చేయడంలో అర్థం లేదు. చాలా పంటలకు సేకరణ లేదు, అందువల్ల చాలా MSPలు విద్యాసంబంధమైనవి. CACP నివేదికల ప్రకారం రైతుల విక్రయాలు వాస్తవానికి MSPధరల కంటే చాలా తక్కువ ధరలవద్ద  జరుగుతాయి.

రైతుల ఆదాయం (దాని నివేదికలో చెప్పుకొన్నట్టుగా ) పెరుగుదలకు, మోడీ ప్రభుత్వ MSPల పెరుగుదలకు -  SBI పరిశోధనలో లింకులు పెట్టిన పద్ధతి నమ్మే విధంగా లేదు.  అటువంటి కేసును నిరూపించడానికి, SBI 'అధ్యయనం' పంటలపై MSPలు గణనీయమైన ప్రభావాన్ని చూపే రాష్ట్రాలను కవర్ చేస్తుందని ఎవరైనా ఊహించి ఉండవచ్చు. కానీ పరిశోధకులు అందుకోసం  ప్రయత్నించలేదు. అధ్యయనంలో చేర్చబడిన నిర్దిష్ట పంటలు - రాష్ట్రాలలో,

(1) చెరకు లేదా సోయాబీన్స్‌లో సేకరణ లేదు;

(2) కర్ణాటకలో వరిని సేకరించలేదు;

(3) 2020-21లో గోధుమల సేకరణలో రాజస్థాన్ వాటా 5.4 శాతం మాత్రమే;

(4) 2019-20లో పత్తి కొనుగోళ్లలో కర్ణాటక, గుజరాత్‌ల వాటాలు వరుసగా 3 శాతం, 10 శాతంగా ఉన్నాయి (మరో మాటలో చెప్పాలంటే, ఈ రాష్ట్రాల్లోని రైతులకు "మెరుగైన" MSPల నుండి వచ్చే లాభాలు గణనీయం కావు. )

(5)గుజరాత్‌లో వేరుశెనగ సేకరణ జరిగినప్పటికీ, మొత్తం సేకరణలో రాష్ట్రం వాటా ఎంత అనేది తెలియదు.[4]


మోడీ ప్రభుత్వం యొక్క MSPలు మెరుగైన "ధరల ఆవిష్కరణ"కు దోహదపడ్డాయని లేదా రైతుల ఆదాయాలపై సానుకూల ప్రభావాన్ని చూపాయని బహిరంగ పరుచుకోవడానికి SBI నివేదిక ఎటువంటి ప్రయత్నం చేయలేదు.

## భారతదేశ వ్యవసాయం వాస్తవ పరిస్థితి

## అసలు నిజం ఏమిటి? వాణిజ్య నిబంధనలు దిగజారుతున్నాయి.


1) తమ పంటలో కనీసం కొంత భాగాన్ని మార్కెట్ చేసే రైతుల ఆదాయం చాలా వరకు వాణిజ్య నిబంధనలపై (ToT) ఆధారపడి ఉంటుంది - అంటే, వారు ఉత్పత్తి చేసిన పంట ధర, వారి ఖర్చుల ధర మీద ఆధారపడి ఉంటుంది. 2011-12 సంవత్సరం 2018-19 సంవత్సరం మధ్య కాలంలో రైతులకు ToTలో క్షీణత కనిపించింది (చార్ట్ 1 చూడండి). అవి 2019-20లో మెరుగుపడి, 2020-21లో మళ్లీ కాస్త తగ్గాయి. అయినప్పటికీ, 2021-22లో స్పష్టంగా తీవ్ర క్షీణత ఉంది, దీని కోసం అధికారిక డేటా ఇంకా ఎదురుచూపుల్లోనే ఉంది. (చార్ట్ 2 చూడండి)

చార్ట్ 1 : వాణిజ్య నిబంధనల సూచి - రైతులకు వ్యవసాయేతరులకు మధ్య - 2009-10, 2011-2012 సగటు = 100




Source: Agricultural Statistics at a Glance 2020, Ministry of Agriculture and Farmers' Welfare.

మూలం: వ్యవసాయ -రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ - గణాంకాల నివేదిక -2020
చార్ట్ 2: వ్యవసాయ ఇన్పుట్ ధర ద్రవ్యోల్బణం vs మొత్తం టోకు ధరల ద్రవ్యోల్బణం, జనవరి 2020-ఫిబ్రవరి 2022




Note: WPI: Wholesale Price Index. Farm inputs: Comprise high speed diesel, fodder, electricity, fertilisers, pesticides, and agricultural and forestry machinery from WPI.
Source: RBI, *Monetary Policy Report*, April 2022.


గమనిక: టోకు ధరల సూచి: వ్యవసాయ ఇన్పుట్లు: టోకుధరల సూచి నుండి హై స్పీడ్ డీజిల్, విద్యుత్, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ, అటవీ యంత్రాలు ఉంటాయి.
మూలం: RBI ద్రవ్య విధాన నివేదిక ఏప్రిల్ 2022

గణనీయమైన ప్రభుత్వ సేకరణ ఉన్న కొన్ని పంటలకు కూడా, ఇటీవలి MSPలు సరైన గిట్టుబాటుతో కూడిన రాబడికి హామీ ఇవ్వలేవని గమనించాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022-23 లో బియ్యం MSP 2021-22 కంటే కేవలం 5 శాతం ఎక్కువగా నిర్ణయించబడిందని గమనించాలి. అయితే RBI సూచి ప్రకారం ఫిబ్రవరి

2022లో వ్యవసాయ ఇన్‌పుట్ ఖర్చులకు సంబంధించి ద్రవ్యోల్బణం 23 శాతానికి పైగా ఉంది. (చార్ట్ 3 చూడండి) .

## GDPలో వ్యవసాయం వాటా పెరగడం - పండగ చేసుకోవాల్సిన విషయం కాదు

2.) SBI నివేదిక ఇంకా ఇలా పేర్కొంది: “అన్ని రంగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసినప్పటికీ, FY21 లో వ్యవసాయ రంగంలో వృద్ధి సానుకూలంగా ఉంది. ఈ ట్రెండ్ FY22లో కూడా కొనసాగింది. ఇది మార్చి 2019 నుండి దేశ జిడిపిలో వ్యవసాయంలో అధిక వాటాకు దారితీసింది. ఇది "వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ... కోవిద్-19 మహమ్మారి సృష్టించిన గందరగోళం రోజులలో - విస్తృత ఆర్థిక వ్యవస్థకు యాంకర్‌గా ఉద్భవించింది"" అని పేర్కొంది.
ఈ వర్ణన ఒక విపత్తు కలిగించిన పుణ్యాన్ని వర్ణిస్తుంది: విపత్తుకాలంలో వ్యవసాయం యొక్క వాటా పెరిగింది ఎందుకంటే మిగతావన్నీ కూలిపోయాయి కాబట్టి. మహమ్మారికి ముందు సంవత్సరం 2019-20లో, డిమాండ్ లేకపోవడం వల్ల తీవ్ర పారిశ్రామిక మాంద్యం ఏర్పడింది (వాస్తవానికి, గత 8 సంవత్సరాలలో రైతుల వాణిజ్య నిబంధనల క్షీణత కూడా పరిశ్రమల డిమాండ్ క్షీణతకు దోహదపడింది. ) తయారీ రంగం GDP 3 శాతం పడిపోయింది. నిర్మాణ రంగం కేవలం 1 శాతం మాత్రమే పెరిగింది. మొత్తం మీద GDP ఒక దశాబ్దానికి పైగాఉన్న కనిష్ట రేటు స్థాయికి పెరిగింది. ఈ అణగారిన పరిస్థితులలో వ్యవసాయం మొత్తం GDP కంటే వేగంగా వృద్ధి చెందింది. GDPలో వ్యవసాయం వాటా పెరిగింది.
మహమ్మారి కాలంలో (2020-21 మరియు 2021-22) వ్యవసాయం మరియు అనుబంధ కార్యకలాపాలలో GDP సాధారణమైన రేటుతో పెరిగింది - కానీ అలా పెరుగుతుందని ఊహించలేదు. - గత 8 సంవత్సరాల సగటు రేటు కంటే కొంచెం తక్కువగా (చార్ట్ 3 చూడండి) పెరిగింది. 2020-21లో పంట వ్యవసాయంలో GDP ( SBI 'అధ్యయనం' కేంద్రీకరించిన అంశం) కేవలం 1.9 శాతానికి పెరిగింది (చార్ట్ 3 చూడండి).[5] వాస్తవానికి పెద్దఎత్తున డప్పుకొట్టి ప్రచారం చేసుకోవడానికి కావాల్సినంత సరుకు ఇందులో లేదు. అంత గొప్ప విజయం కాదు. అంతేకాదు .... ఆర్థిక వ్యవస్థలోని దాదాపు అన్ని రంగాలు చాలా నెలల పాటు లాక్‌డౌన్‌లో ఉన్నందున, ప్రతికూల వృద్ధిని కలిగి ఉన్నందున, మరోసారి 2020-21లో కూడా వ్యవసాయం GDPలో ఎక్కువ వాటాను కలిగి ఉంది.





Source: National Statistical Office.

మూలం: జాతీయ గణాంకాల కార్యాలయం (NSO)

## వ్యవసాయ శ్రామికశక్తిలో పెరుగుదల- క్షోభకు సంకేతం

(3) వ్యవసాయం రంగం GDP గత రెండు సంవత్సరాలలో మధ్యస్తంగా వృద్ధి చెందింది, అదే కాలంలో వ్యవసాయంలో శ్రామికుల సంఖ్య కూడా చాల నాటకీయంగా పెరిగింది. [6] ఈ జోడింపులలో ప్రధానంగా మహిళలు, వ్యవసాయ కుటుంబ క్షేత్రాలలో సహాయకులుగా వేతనం లేకుండా పనిచేస్తున్న వారు ఉన్నారు. లాక్డౌన్ కారణంగా కుటుంబ ఆదాయాన్ని కోల్పోవడంతో, ఎలాగోలా మరికొన్ని రూపాయల ఆదాయాన్ని తీసుకురావడానికి మహిళలు వ్యవసాయ పనులు (వారి ఇంటి పనులతో పాటు) చేయవలసిన అవసరంతో వత్తిడికి గురయ్యారు.


చార్టు 4: శ్రామిక మహిళలు కార్మికశక్తిలో వేతనం లేని కూలీలుగా వ్యవసాయ క్షేత్రాల్లో చేరారు.




* Rural women in employment as a proportion of all rural women.
Source: *Periodic Labour Force Survey, Annual Report*, 2020-21.

అయితే దీని అర్థం ఏమిటంటే వ్యవసాయంలో ప్రతి కార్మికుని ఆదాయం పడిపోయింది. (చార్టు 5 చూడండి) ఇది బాధకు చిహ్నం.

చార్టు 5: వ్యవసాయంలో ఒక కార్మికుడికి సగటున జోడించిన స్థూల విలువ ( వ్యవసాయపంట + పశువులు) 2011-12 ధరల సూచి ప్రకారం.




Note: We have taken GDP data for crop agriculture and livestock for the April-March financial year, whereas the PLFS data relate to July-June.
Source: Census of India for population projections, PLFS 2020-21 for workforce population ratio and agriculture share of employment, National Statistical Organisation for gross value added in agriculture.

గమనిక: మేము ఏప్రిల్ - మార్చి ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ పంటలు, పశు సంపద డేటాను తీసుకున్నాము, ఇక్కడ PLFS డేటా జూలై - జూన్‌కు సంబంధించినది.
మూలం: జనాభా కోసం భారతదేశ జనాభా గణన, శ్రామిక శక్తి జనాభా నిష్పత్తి, ఉపాధిలో వ్యవసాయ వాటా - వివరాలకోసం PLFS 2020-21 నుంచి , వ్యవసాయంలో స్థూల విలువ జోడించిన వివరం - జాతీయ గణాంక సంస్థ నుంచి తీసుకొన్నాము.

## గ్రామీణ డిమాండ్ తగ్గుదల

4) వరుసగా రెండవ సంవత్సరం కూడా కొంచెం ఎక్కువ-తక్కువలతో సాధారణ పంట దిగుబడులు ఉన్నప్పటికీ (2022లో గోధుమ పంటను మినహాయించి) గ్రామీణ డిమాండ్‌లో తిరోగమనం నెలకొన్నట్టుగా నిత్య వినియోగ వస్తువులు (FMCGలు), ద్విచక్ర వాహనాలను ఉత్పత్తి చేసే కంపెనీలు రిపోర్ట్ చేశాయి. వాస్తవానికి, 2021-22లో ఈ వస్తువుల గ్రామీణ విక్రయాల పరిమాణం పడిపోయింది. ఇది వ్యవసాయ ఆదాయాల పెరుగుదలపై SBI నివేదిక చేస్తున్న తేలికైన వాదనలకు మద్దతు ఇవ్వదు. క్లుప్తంగా, వాస్తవ ప్రపంచంలోని అన్ని సాక్ష్యాలు భారతదేశంలో రైతుల ఆదాయాలు ఎంత క్షీణ దశలో ఉన్నాయో సూచిస్తున్నాయి. ఇంకా ఎంతగా రోజురోజుకి దిగజారుతున్నాయో తెలుపుతున్నాయి. ఈ వాస్తవం ఇలా ఉంటే, SBI పరిశోధన నివేదిక రచయితలు ఒక మ్యాజిక్ ట్రిక్ ను ప్రయోగిస్తున్నారు : వారు రైతుల ఆదాయాలు వృద్ధి చెందుతున్నాయని నిరూపించడానికి ప్రైవేట్, యాక్సెస్ చేయలేని డేటాను రూపొందించారు. కానీ, అన్ని మ్యాజిక్ ట్రిక్స్ లాగానే, ఇది కూడా దృష్టి మళ్లింపు, భ్రమలకు గురిచేయడం పద్దతులపై ఆధారపడింది. వాస్తవానికి, పాలకులు అనేకసార్లు వాగ్దానం చేసిన విధంగా రైతుల ఆదాయాలు “రెట్టింపు” అయ్యాయని 'అధ్యయనం' చేయడానికి ముందే నిర్ధారణకు వచ్చి - పరిశోధకులు ఏదో ఒకవిధంగా అది నిరూపించడానికి అవసరమైన డేటాను రూపొందించారని అనిపిస్తుంది.

ఇటీవలి సంవత్సరాలలో, SBI రీసెర్చ్ చాలా పెద్ద క్లెయిమ్‌లు చేయడంలో ఖ్యాతిని పొందింది. జనవరి 2018లో, SBI రీసెర్చ్ హెడ్ (సహ-రచయితతో పాటు) 2017-18లో సంఘటిత రంగం - వేతన జీవుల జాబితాకు ఏడు మిలియన్ల మంది వ్యక్తులు జోడించబడతారని పేర్కొంటూ ఒక అధ్యయనాన్ని ప్రచురించారు. [7] కార్మిక అంశాలపై నిపుణులైన ఆర్థికవేత్తలు అధ్యయనంలో ఉన్న లోపాలను ఎత్తి చూపారు,[8] దీనిని ప్రధాన మంత్రి, ఆర్థిక మంత్రి మొదలైనవారు కూడా ఉదహరించారు.

ఇటీవల, SBI రీసెర్చ్ ఒక అధ్యయనాన్ని రూపొందించింది, భారతదేశం - అనధికారిక రంగం 2017-18లో 50 శాతం నుండి 2020-21లో కేవలం 15-20 శాతానికి తగ్గిపోయింది - ఇది యూరప్‌తో పోల్చదగిన స్థాయి అంటూ పేర్కొంది. ఈ గమనిక కూడా చాల అసంబద్ధమైన ఊహలతో గంతులు వేస్తున్నట్టుగా ఉందని అనేక మంది ఆర్థికవేత్తలు పక్కన పెట్టారు [9]. కానీ ఆర్థిక వేత్తల అభిప్రాయం మీడియాలో దాని విస్తృత ప్రచారాన్ని నిరోధించలేదు.

ఈ మునుపటి నివేదికలు/అధ్యయనాల ద్వారా రూపొందించబడిన అవాస్తవ సమాచారం (ఫ్యాక్టాయిడ్లు) ఇంకా చెలామణిలో ఉంది, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడంలో SBI రీసెర్చ్ విషయంలో కూడా అదే జరగవచ్చు. కానీ ఈ అవాస్తవాన్ని నిలదీయడం మరింత అవసరం.

[డ్రాఫ్ట్‌పై చాలా సహాయకరమైన వ్యాఖ్యలకు బిస్వజిత్ ధర్‌కు ధన్యవాదాలు; లోపాలు ఏవైనా ఉంటే అవి మావే.]

______________________________